క్లుప్తంగా

అధికారులు నిర్లక్ష్యం వీడాలి

రాజోళి: ఆర్‌డీఎస్ కెనాల్‌లో చేపడుతున్న మరమ్మతులో అధికారులు నిర్లక్ష్యం వీడాలని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు కేశవరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కెనాల్ ద్వారా నీరు చివరి ఆయకట్టుకు అందాలంటే బలోపేతం అవసరమని, మరమ్మతుతో సరిపెట్టడం సరికాదని వివరించారు. పనులు వేగవంతం చేసి వర్షాకాలం సీజన్ ప్రారంభం లోగా కెనాల్‌కు పటిష్టం చేయాలని కోరారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి



మల్దకల్: వీఓఏలకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఆ సంఘం మండల నాయకులు బాషా, చంద్రాములు డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని మండల మహిళా సమాఖ్య భవనం ఎదుట వీఓఏలు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి ఉద్యోగ భద్రతతో పాటు రూ.10 లక్షల ప్రమాదబీమా అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో మహేందర్, శంకర్‌గౌడ్, గోవిందు, మునిస్వామి, హనుమంతు, వెంకట్రాములు, చెన్నమ్మ పాల్గొన్నారు.

25న రేషన్ బియ్యం వేలం పాట

కేటీదొడ్డి: మండలంలోని వివిధ ప్రాంతాలలో పోలీసులు, రెవెన్యూ అధికారులు దాడులలో పట్టుబడిన రేషన్‌బియ్యాన్ని బహిరంగానే వేలం పాట నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ సుందర్‌రాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 25న మొత్తం 45 క్వింటాళ్ల 70 కేజీల రేషన్ బియ్యం వేలం వేస్తామని పేర్కొన్నారు. వేలం పాటలో పాల్గొనే వారు ఈ నెల 24 లోపు రూ.1000 డీడీ తీసి ముందుగానే తహసీల్దార్ కార్యాలయంలో సమర్పించాలని వివరించారు. ఉదయం 11 గంటలలోపు కార్యాలయంలో హాజరుకావాలని కోరారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన

మల్దకల్: మండలంలోని అమరవాయి, తాటికుంట, సద్దలోనిపల్లి గ్రామాల్లో కొనసాగుతున్న ఉపాధి హామీ పనులను సోమవారం ఎంపీడీఓ కృష్ణయ్య పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాబ్‌కార్డులు ఉన్న కూలీలందరూ ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. పనుల వద్ద కూలీలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. కూలీలు ఉదయం, సాయంత్రం వేళల్లో ఉపాధి పనులు చేయాలన్నారు. కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మండలంగా ప్రకటించాలని నిరాహార దీక్ష



అయిజ: ఆర్డీఎస్ ఆయకట్టు ప్రాంతానికి కేంద్రంగా ఉన్న మేడికొండను నూతన మండలంగా ప్రకటించాలని గ్రామస్తులు సోమవారం గ్రామంలో నిరాహారదీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మేడి కొండ రవాణా పరంగా అన్ని సౌకర్యాలు ఉన్నాయని పేర్కన్నారు. మేడికొండను నూతన మండలంగా ప్రకటించకుంటే ఉద్యమ కార్యాచరణ చేపట్టి ఉద్యమాలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

19న మండల సమావేశం

ఆత్మకూర్: మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ బంగారు శ్రీనివాసులు అధ్యక్షతన ఈనెల 19న నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వెంకటేశ్వర్లు తెలిపారు. సమావేశంలో వైద్యం, వ్యవసాయం, విద్య, పౌరసరఫరాలు, ఇరిగేషన్, పంచాయతీరాజ్, విద్యుత్, ఐసీడీఎస్, తాగునీరు, ఉపాధిహామీ, పశువైద్యం తదితర శాఖల అభివృద్ధిపై సమీక్ష కొనసాగుతుందన్నారు. సమావేశానికి మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారని ఆయాశాఖల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు తప్పకుండా హాజరు కావాలని కోరారు.

బొడ్రాయి ప్రతిష్ఠాపనకు ఏర్పాట్లు

అమరచింత: పట్టణంలో త్వరలో బొడ్రాయి ప్రతిష్ఠాపనకు ముందస్తు సమీక్షలు అవసరమని, పట్టణ ప్రజల అభీష్టం మేరకు ఉత్సవాలు నిర్వహిస్తున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ, ప్రముఖ సిద్ధాంతి గోపాలకృష్ణ తెలిపారు. భక్త మార్కండేయ ఆలయ ఆవరణలో సోమవారం బొడ్రాయి ప్రతిష్ఠపనకు కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. పట్టణంలో ప్రాథమికంగా 9 బొడ్రాళ్లతో యంత్రం, మంత్రం, తంత్రంతో అష్టదిగ్బంధం చేయాలన్నారు. దీనికోసం పట్టణ శివారు ప్రాంతాలను గుర్తించి అన్ని వర్గాల కుల పెద్దలతో చర్చించారు. త్వరలోనే బొడ్రాయి ప్రతిష్ఠాపన ఉత్సవాల తేదీలను ప్రకటిస్తామన్నారు.

క్రీడా పోటీలను విజయవంతం చేద్దాం



పాతపాలెంలో క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న అధికారులు

శాంతినగర్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సీఎం కప్ క్రీడల టోర్నమెంట్‌ను విజయవంతం చేద్దామని ఎంపీడీఓ రవీందర్ అన్నారు. సోమవారం వడ్డేపల్లి మండల పరిషత్ కార్యాలయంలో మండలస్థాయి అధికారుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో బుధవారం ఉదయం 9 గంటలకు క్రీడా పోటీలు ప్రారంభిస్తామన్నారు. మండల పరిధిలోని ఆయా గ్రామాలకు చెందిన క్రీడాకారులు వారి పేర్లను నమోదుచేసుకోవాలని కోరారు. సమావేశంలో ఎంపీపీ రజిత, ఎంఈఓ నరసింహులు, ఆర్ఐ ఆంజనేయులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

గెలుపోటములు సహజం..

కేటీదొడ్డి: క్రీడల్లో గెలుపోటములు సహజమని ఎంపీపీ మనోరమ అన్నారు. సోమవారం మండలంలోని పాతపాలెంలో సీఎం కప్ 2023 మండల స్థాయి క్రీడా పోటీలను ఎంపీడీఓ మహ్మద్ అజార్ మోహిద్దీన్, తహసీల్దార్ సుందర్‌రాజ్, వైస్ ఎంపీపీ మనోరమ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ సురేష్, ఎంపీఓ సయ్యద్‌ఖాన్, సర్పంచ్ సూర్యప్రకాష్ పాల్గొన్నారు.

రాజోళి: మండలంలో నిర్వహిస్తున్న సీఎం కప్ క్రీడల్లో పాల్గొనే వారు పేర్లు నమోదు చేసుకుని పోటీల్లో పాల్గొనవచ్చని ఎంపీపీ మరియమ్మ తెలిపారు. మండల కేంద్రంలోని కొత్త రాజోళిలో కబడ్డీ, ఖోఖో తదితర క్రీడల పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆసక్తి గల వారు ఉదయం 8 గంటల వరకు పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

మల్దకల్: క్రీడలు మానసికోల్లాసానికి దోహదపడతాయని ఎంపీపీ రాజారెడ్డి క్రీడాకారులకు అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సీఎం కప్ మండల స్థాయి క్రీడా పోటీలను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో ఎంపీపీ మాట్లాడుతూ క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరించాలన్నారు. ప్రతి క్రీడాకారుడు తమ క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించి మంచి పేరు తెచ్చుకోవాలన్నారు. అనంతరం వాలీబాల్, కబడ్డీ, ఖోఖో క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. మొదటి రోజు వివిధ గ్రామాల నుంచి వాలీబాల్, కబడ్డీ, ఖోఖోలో మొత్తం 16 టీములు పాల్గొన్నాయి. కార్యక్రమంలో సర్పంచ్ యాకోబు, సింగిల్‌విండో అధ్యక్షుడు తిమ్మారెడ్డి, తహసీల్దార్ హరికృష్ణ, ఎంపీడీఓ కృష్ణయ్య, ఇన్‌చార్జి ఎంఈఓ కొండారెడ్డి, ఎస్ఐ శేఖర్, నాయకులు వెంకటేశ్వరరెడ్డి, హైదర్‌సాబ్, పీఈటీలు వెంకట్రాములు, సుభాషిణి, నిర్వాహకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

మానవపాడు: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం సీఎం కప్ పోటీలు నిర్వహిస్తున్నామని ఎంపీడీఓ రమణరావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మంగళవారం ఉదయం 7.30 గంటలకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో క్రీడలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు.



శాంతినగర్‌లో మాట్లాడుతున్న ఎంపీడీఓ రవీందర్



మల్దకల్‌లో మాట్లాడుతున్న ఎంపీపీ రాజారెడ్డి

గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ



వైద్య సిబ్బందితో చర్చిస్తున్న జిల్లా వైద్యశాఖ అధికారి శశికళ

మానవపాడు: గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని జిల్లా వైద్యశాఖ అధికారి శశికళ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. వారం రోజుల కిందట ఏడు నెలల గర్భిణి పట్ల నిర్లక్ష్యం వ్యవహించిన స్టాఫ్‌నర్స్ యాదమ్మ, కంటిజెంట్ వర్కర్ గోకారమ్మపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోసారి ఇటువంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వారిపై నోటీసులు ఇచ్చామని మరోసారి పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యసిబ్బందిని సూచించారు. కార్యక్రమంలో ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ ప్రవంతి, డాక్టర్ రిజ్వానా తాన్వీర్, జిల్లా వ్యాక్సిన్ మేనేజ్‌మెంట్ నరేందర్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

సబ్సిడీ విత్తనాలను సద్వినియోగం చేసుకోండి



జీలుగ విత్తనాలను విక్రయిస్తున్న సింగిల్‌విండో అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి

అయిజ: ప్రభుత్వం అందజేస్తున్న సబ్సిడీ విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని సింగిల్ విండో ప్రసిడెంట్ మధుసూదన్‌రెడ్డి కోరారు. సోమవారం సింగిల్‌విండో కార్యాలయంలో జీలుగ విత్తనాల విక్రయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జీలుగ సాగుతో భూసారం పెరుగుతుందన్నారు.

వరి పంట సాగుకన్నా ముందే మడుల్లో జీలుగ విత్తనాలను చల్లాలన్నారు. జీలుగ 30 కేజీల విత్తనాల ధర రూ. 2,407 కాగా 65 శాతం సబ్సిడీతో రూ. 843లకు అందిస్తుందన్నారు. జీలుగ విత్తనాలు కావాల్సిన రైతులు ఆయా గ్రామాల్లోని వ్యవసాయ విస్తరణ అధికారులతో టోకెన్ తీసుకోవాలని, సింగిల్‌విండో కార్యాలయంలో డబ్బులు చెల్లించాలని సూచించారు. రైతులు ఆధార్ కార్డు, పట్టాదారు పాస్ పుస్తకం జిరాక్స్‌లను తీసుకురావాలని కోరారు.

అంధత్వ నివారణే ప్రభుత్వ ధ్యేయం



తుమ్మలచెరువులో కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్

గట్టు: అంధత్వ నివారణే ప్రభుత్వ ధ్యేయమని సర్పంచ్ అనిత అన్నారు. సోమవారం మండలంలోని తుమ్మలచెరువులో కంటి వెలుగు శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. తుమ్మలచెరువు, తప్పెట్లమొర్సు, బల్గెర గ్రామాల్లో మొత్తం 403 మందికి కంటి పరీక్షలు, 23 మందికి కంటి అద్దాలు, 29 మందికి అద్దాల కోసం ప్రతిపాదనలు పంపినట్లు వైద్యాధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ రఘుపతి, ఎంపీటీసీ నర్సింహులు, గ్రామస్తులు రాఘవరెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, వైద్యాధికారులు రవి, తిమ్మప్ప, సాయిచరణ్, హెల్త్ సూపర్‌వైజర్లు స్వర్ణలత, బాలమ్మ, ఏఎన్ఎంలు భారతి, రేష్మ, ఖేజీయా ఆయా గ్రామాలకు చెందిన ఆశా వర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఉండవెల్లి: మండలంలోని మారమునగాల-1లో కంటి వెలుగు శిబిరాన్ని సర్పంచు శివ నారాయణ, ఎంపీటీసీ కురుమూర్తి ప్రారంభించారు. 147 మంది కంటి పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో వైద్యులు, ఏఎన్ఎంలు, ఆశాలు, పాల్గొన్నారు.

తిరుపతిలో సత్తాచాటిన చిన్నారులు



తిరుపతిలో ఉత్తమ ప్రశంసా పత్రాలు అందుకుంటున్న చిన్నారులు

ఎర్రవల్లిచరస్తా: ఇటిక్యాల మండలంలోని ఎర్రవల్లి నటరాజ నాట్య వసంతం అకాడమీ చిన్నారులు సోమవారం తిరుపతిలో నిర్వహించిన అన్నమాచార్య 614వ జయంతి ఉత్సవాలలో పాల్గొని సత్తా చాటారు. ఈ సందర్భంగా తిరుపతి మహతి ఆడిటోరియంలో భారత ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించిన అన్నమయ్య సంగీత నృత్య నీరాజనం కార్యక్రమంలో నటరాజ నాట్య వసంతం అకాడమీకి చెందిన చిన్నారులు నిహారిక, ప్రీతి, రవిప్రకాష్, దివ్య, వ్యాన, హిమజ, కీర్తి, సోనియ, రత్నజ, నిత్య, యస్వితలు పాల్గొని తమ నృత్యాలతో ఉత్తమ ప్రతిభను కనబరిచి ప్రశంసాపత్రాలు అందుకున్నారు. ఉత్తమ ప్రతిభను కనబర్చిన చిన్నారులను నటరాజ నాట్య మండలి నిర్వాహకురాలు జ్యోతి, చిన్నారుల కుటుంబ సభ్యులు, గ్రామస్తులు అభినందించి హర్షం వ్యక్తం చేశారు.

సీబీఎస్ఈ ఫలితాలలో ఎస్ఆర్ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న అడిషనల్ కలెక్టర్ అపూర్వ్ చౌహాన్

గద్వాల: సీబీఎస్ఈ పదో తరగతి పరీక్ష ఫలితాల్లో గద్వాల ఎస్ఆర్ ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ చాటారు. పాఠశాలకు చెందిన ప్రేమాన్షు 483 అత్యధిక మార్కులు సాధించి జిల్లా టాపర్‌గా నిలిచారు. వంద శాతం ఉత్తీర్ణత సాధించడంతో పాటు 11 మంది విద్యార్థులు ఏ1గ్రేడ్ సాధించారు. జిల్లాలోనే ఈ ఏడాది అత్యధికంగా మార్కులు సాధించిన పాఠశాలగా ఎస్ఆర్ ఇంటర్నేషనల్ స్కూల్ గుర్తింపు సాధించింది. సోమవారం పది ఫలితాలలో ప్రతిభ చాటిన విద్యార్థులను అడిషినల్ కలెక్టర్ అపూర్వ్‌చౌహాన్, జిల్లా ఎస్పీ సృజనలు వేర్వేరుగా అభినందించారు. రాబోవు రోజుల్లో మరిన్ని విజయాలు సొంతం చేసుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ సైతం విద్యార్థుల ప్రతిభను కొనియాడారు. జిల్లా కేంద్రానికి చెందిన కాకతీయ టెక్నోస్కూల్ విద్యార్థుల ప్రతిభను సైతం వారు కొనియాడారు. పాఠశాలకు చెందిన విద్యార్థి శశాంక్ 10/10 జీపీఏ పాయింట్లు సాధించి సత్తా చాటారు. డైరెక్టర్లు రాముడు, శ్రీకాంత్‌జోషి తదితరులు పాల్గొన్నారు.

క్రీడా సామగ్రి అందజేత

ఆత్మకూర్: స్థానిక మినీస్టేడియంలో వేసవి శిక్షణ శిబిరంలో పాల్గొంటున్న క్రీడాకారులకు పట్టణానికి చెందిన ప్రముఖ వాస్తుప్లానర్ రమాకాంత్ రూ.5 వేలతో క్రీడా సామగ్రిని అందజేశారు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన క్రీడాకారులు జాతీయ స్థాయి లో రాణించాలని, క్రీడాకారులను ప్రభుత్వం ప్రోత్సహించాలని కోరారు. కోచ్‌లు ఖాదర్, శ్రీకాంత్, సిరాజ్, నరేందర్, బాలు, మురళి, నర్సింహ, దివాకర్, కిషోర్, డాక్టర్ సందీప్‌రెడ్డి పాల్గొన్నారు.

'మాదాసి కుర్వలకు ఎస్సీ సర్టిఫికెట్ ఇవ్వొద్దు'

అమరచింత: రాష్ట్రంలోని మాదాసి కుర్వలకు ఎస్సీ కుల ధ్రువీకరణ సర్టిఫికెట్ ఇవ్వొద్దని, వారు ఆర్థికంగా బలంగా ఉన్నారని ఎస్సీ సామాజిక వర్గ యువకులు తహసీల్దార్‌కు సోమవారం వినతిపత్రం అందించారు. ఎస్సీలు అయిన మాల, మాదిగ, బుడగజంగాలు, హోలీయ దాసరులు ఊరికి దూరంగా జీవిస్తూ ఇప్పటికీ అంటరానితనాన్ని అనుభవిస్తున్నారని వాపోయారు. ఎస్సీ సర్టిఫికేట్లు కావాలని డిమాండ్ చేస్తున్న మాదాసి కుర్వలకు అలా అడిగే హక్కు లేదన్నారు. దీనిపై తహసీల్దార్ చాంద్‌పాషా మాట్లాడుతూ ఈ విషయాన్ని కలెక్టర్‌కు విన్నవిస్తామన్నారు. కార్యక్రమంలో శేఖర్, సూరి, మాల సూరిబాబు, సునీల్, కార్తీక్, సురేందర్, శ్యామ్ సుమన్, వినీత్, అజయ్ పాల్గొన్నారు.

బైక్, కారు ఢీ: ఇద్దరికి గాయాలు

పెబ్బేరు: బైక్‌ను కారు ఢీకొన్న ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ ఘటన సోమవారం రంగాపూర్ ఎన్‌హెచ్44పై చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పైపా డు గ్రామానికి చెందిన మధుసూదన్‌రెడ్డి, అత డి భార్య మన్నెమ్మ బైక్‌పై పెబ్బేరుకు పని నిమి త్తం వెళ్తుండగా రంగాపూర్ సమీపంలో ఎన్‌హెచ్44పై హైదరాబాద్ నుంచి కర్నూల్ వైపు వెళ్తున్న కారు బైక్‌ను వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. దీంతో బైక్‌పై ఉన్న భార్యభర్తలకు గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే క్షతగాత్రులను 108లో ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదంపై పోలీసులను సమాచారం అడుగగా ఎలాంటి పిర్యాదు అందలేదని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు



రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఆంజనేయులు

గట్టు: మండలంలోని బల్గెర గ్రామ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలైన ఘటన సోమవారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం యల్లందొడ్డి గ్రామానికి చెందిన ఆంజనేయులు వివిధ పనుల నిమిత్తం కర్ణాటకలోని యరగేరకు వెళ్లి ద్విచక్రవాహనంపై స్వగ్రామానికి తిరుగుపయనం అయ్యాడు. బల్గెర గ్రామ సమీపంలో ద్విచక్రవాహనాన్ని గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆంజనేయులకు గాయాలై రోడ్డు పక్కన పడిఉన్నాడు. అటువైపుగా వెళ్తున్న సర్పంచ్ హనుమంత్‌నాయుడు గాయపడిన వ్యక్తిని గమనించి 108 ద్వారా గద్వాల ఏరియా ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. ఈ సంఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఏఎస్ఐ రాంచందర్‌జీ తెలిపారు.

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం



సమస్యలు తెలుసుకుంటున్న టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధినాగరాజ్‌గౌడ్

అమరచింత: గ్రామాల్లో ప్రజలు నిత్యం సమస్యలతో సతమతమవుతున్నా.. పరిష్కరించాల్సిన అధికారులు, ప్రజాప్రతినిధులు మొద్దు నిద్రపోతున్నారని టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి కేశం నాగరాజ్‌గౌడ్ ఆరోపించారు. మండలంలోని చంద్రగఢ్‌లో సోమవారం ఆయన పర్యటించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రతి రోజు విద్యుత్ సమస్య వేధిస్తున్నా సంబంధిత ట్రాన్స్‌కో అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు అసహనం వ్యక్తం చేశారు. దీంతో సంబంధిత ట్రాన్స్‌కో ఏఈతో మాట్లాడుతూ విద్యుత్ సమస్యను వెంటనే పరిష్కరించకపోతే కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. పర్యటక, చారిత్రక గ్రామమైన చంద్రగఢ్‌లో కోటను పర్యటక ప్రాంతంగా బీఆర్ఎస్ ప్రభుత్వం గుర్తించక పోవడం శోచనీయం అన్నారు. రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమని చంద్రగఢ్‌కు సముచిత స్థానం కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి ఆయూబ్ ఖాన్, మండల పార్టీ అధ్యక్షుడు మహేందర్ రెడ్డి, తమ్మిరెడ్డి, ప్రభాకర్, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు



తనిఖీలు చేస్తున్న ఎంఏఓ శంకర్‌లాల్, ఎస్ఐ నరేష్ కుమార్

అయిజ: రైతులకు నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు తప్పవని మండల వ్యవసాయ అధికారి శంకర్‌లాల్ హెచ్చరించారు. సోమవారం మండల కేంద్రంలో విత్తనాల విక్రయ దుకాణాలను ఎస్ఐ నరేష్‌కుమార్‌తో కలిసి ఎంఏఓ శంకర్‌లాల్ తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రైతులకు నాణ్యమైన విత్తనాలను విక్రయించాలని, రశీదులు అందజేయాలని, ప్రతిరోజు అమ్మిన వివరాలను, స్టాక్ పాయింట్ వివరాలను నమోదు చేయాలని కోరారు. రైతులుకు పలు సలహాలు, సూచనలు చేశారు. తనిఖీల్లో పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం వద్దు

అమరచింత: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిరుద్యోల జీవితాలతో ఆడుకుంటున్నాయని, ఉద్యోగ భర్తీ చేపట్టడంలో నిర్లక్ష్యం వహిస్తున్నాయని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కుతుబ్ అన్నారు. మండలంలోని కొంకన్‌వానిపల్లిలో సీపీఐ పాదయాత్ర కరపత్రాలను సోమవారం విడుదల చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి తొమ్మిదేళ్లు పూర్తవుతున్నా.. ఇప్పటికి వరకు ఇచ్చిన హామీలను అమలు చేయట్లేదని దుయ్యబట్టారు. కర్ణాటక రాష్ట్ర ప్రజలు కేంద్ర ప్రభుత్వ కుట్రలను గుర్తించి అక్కడి బీజేపీకి ఘోరీ కట్టారని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో మల్లేష్, వెంకటేష్, అంజన్న, కిష్టయ్య పాల్గొన్నారు.

ఉపాధి హామీ పథకంపై ఆడిట్



ఉపాధి హామీపై ఆడిట్ నిర్వహిస్తున్న అధికారులు

కేటీదొడ్డి: మండల కేంద్రంలోని పాఠశాల ఆవరణలో మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం 2020–2023 సంవత్సరంలో చేసిన పనులకు సంబంధించి సోమవారం ఏర్పాటు చేసిన ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్‌డీఓ ఉమాదేవి, విజిలెన్స్ ఆఫీసర్ శ్రీనివాసులు, జమ్మన్నలు వివిధ గ్రామాలలో జాతీయ ఉపాధి హామీ పథకం నిధుల కింద పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ చేసిన పనుల బిల్లులను పరిశీలించారు. మొత్తం 13,26,13,984 లక్షల పనులకు ఆడిట్ నిర్వహించారు. ఫైన్‌రూపంలో రూ.43,944 వేలు రికవరీ చేసినట్లు తెలిపారు. కూలీలకు 10,47,90,979 చెల్లించినట్లు. మెటీరియల్‌కి 2,78,23005 చెల్లించినట్లు ఎంపీడీఓ మహ్మద్ అజార్ మోహిద్దీన్ తెలిపారు. ఎంపీపీ మనోరమ, ఏపీఓ కుమార్, ఎంపీఓ సయ్యద్‌ఖాన్ ఉన్నారు.

నామమాత్రంగా సీసీ రోడ్ల శాంపిల్స్ సేకరణ



సీసీ రహదారి శాంపిల్స్ తీసుకుంటున్న క్వాలిటీ కంట్రోల్ టీం సభ్యులు

అమరచింత: పట్టణంలో సుమారు రూ.3.5కోట్లతో నిర్మించిన సీసీ రహదారుల నాణ్యతను పరిశీలించడానికి వచ్చిన అధికారులు సైతం నామమాత్రంగా పరిశీలనలు చేస్తున్నారని పట్టణ ప్రజలు ఆరోపిస్తున్నారు. పట్టణంలో సోమవారం క్వాలిటీ కంట్రోల్ విభాగానికి సంబంధించి ఏఈ ఆధ్వర్యంలో సీసీ రహదారుల శాంపిల్స్ సేకరించారు. ఎవరికీ చెప్పపెట్టకుండా వచ్చి శాంపిల్స్‌ను సేకరించాల్సిన క్వాలిటీ కంట్రోల్ అధికారి రహదారిని నిర్మించిన కాంట్రాక్టర్‌తో కలిసి శాపింల్స్ సేకరించడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. రహదారుల నిర్మాణంలో ప్రధాన బీటీ రహదారికి సమీపంలో మెటీరియల్ అధికంగా వేసి నిర్మించిన ప్రాంతాల్లో శాంపిల్స్ తీయడం దారుణమన్నారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన సీసీ రహదారులను పూర్తి స్థాయిలో పరిశీలించి నాణ్యమైన రోడ్లను నిర్మించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

మొక్కలకు రక్షణేది?

- ఎండాకాలంలో పర్యవేక్షణ కరువు
- పట్టించుకోని అధికారులు



ఉండవెల్లిలో ఏర్పాటు చేసిన నర్సరీ

ఉండవెల్లి: రాష్ట్రంలో అడువుల శాతం పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం హరితహారం కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా గ్రామాల్లో నర్సరీల ఏర్పాటుతో పాటు ఇంటింటా ఆరు మొక్కలు పంపిణీ చేసింది. నాటిన మొక్కలు ప్రస్తుతం ఏపుగా పెరిగి పచ్చదనం పరుచుకున్నాయి. ఎంతో పకడ్బందీగా వర్షాకాలంలో నాటిన మొక్కలు ఎండాకాలంలో వాటిని కాపాడేవారె లేరు. చెట్లు దెబ్బతినడంతో వాటిని సంరక్షించేందుకు వనసేవకులు కరువయ్యారు. రైతుల పంట పొలాల పక్కన మొక్కలను కొందరు దుండగులు అగ్నికి ఆహుతి చేస్తున్న అధికారులు చర్యలు తీసుకోవడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి.

నియోజక వర్గంలో 124 నర్సరీలు..

అలంపూర్ నియోజక వర్గంలో 7 మండలాల్లో 124 గ్రామ పంచాయతీల్లో నర్సరీలు ఉన్నాయి. ఒక గ్రామ పంచాయతీలో 10 వేల మొక్కలను పెంచేందుకు రూ.1 లక్ష 70 వేలు కేటాయిస్తారు. మొక్కలను గ్రామ పంచాయతీల్లోను రోడ్లకు ఇరువైపులా నాటించి వాటిని సంరక్షించేందుకు వనసేవకులను ఏర్పాటు చేస్తారు. ఒక గ్రామ పంచాయతీకి 5 మందిని వనసేవకులను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంది. అలంపూర్ నియోజక వర్గంలో దాదాపు 114 మంది వన సేవకులు ఉండగా ఒక్కొక్కరూ 200 మొక్కలన కాపాడుతున్నారు. మొక్కలను వర్షాకాలం కాపాడుతున్న ఎండాకాలంలో అశ్రద్ధ చూపడంతో మొక్కలు ఎండుతున్నాయి. ఎండాకాలంలో 30 శాతానికి పైగా అగ్నికి ఆహుతి అవుతున్నా అధికారుల్లో చలనం లేదని పలువురు విమర్శిస్తున్నారు. ట్యాంకర్ల ద్వారా నీటిని నామమాత్రంగా పోస్తూ చేతులు దులుపుకుంటున్నారు.

పర్యవేక్షణ లేక..

హరితహారంలో భాగంగా మొక్కలను నాటి వాటి రక్షణకు ట్రీగార్డు, నీటి ట్యాంకర్లు, వనసేవకులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఎంపీడీఓలు, తదితర విభాగాలలో అధికారులు ఉన్నా పర్యవేక్షణ లేకపోవడంతో మొక్కలు ఎండుతున్నాయి.

మొక్కలపై ప్రత్యేక శ్రద్ధ..

ప్రతి మండలంలో మొక్కలను సంరక్షించాలని అధికారులకు సూచిస్తున్నాం. మొక్కలను నరికితే చర్యలు తీసుకుంటాం. నాటిన మొక్కలను కాపాడేందుకు వన సేవకులను ఏర్పాటు చేసాం. ఎండాకాలంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం.

–నాగేంద్రం, అడిషనల్ డీఆర్‌డీఓ